# కౌసల్య

''కుంటివాడిని, బాబయ్యా! ధర్మం చెయ్యండి, బాబయ్యా!'' అన్న ముష్టి వాడి కేకతో తుళ్ళిపడ్డాను. అప్రయత్నంగా నా చూపులు క్రిందికి మళ్ళాయి. కాళ్ళవంక చూసుకున్నాను. అవిటితనం నన్ను వెక్కిరించింది.

''కుంటివాడినమ్మా, తల్లీ!'' మళ్ళీ మళ్ళీ ముష్టివాడి కేకలు.

వినలేనట్టు చెవులు మూసుకున్నాను. అసహనంగా మంచం మీద అటూ, ఇటూ కదిలాను.

మూసుకున్న చెవుల్లో 'కుంటివాడినమ్మా' అన్న అరుపు అస్పష్టంగా ప్రతిధ్వనిస్తూంది. మరి ఉండలేకపోయాను.

రంగమ్మ [illegible] లేస్తూ ఆదరా బాదరా నా గదిలోకి వచ్చింది రంగమ్మ — ''పిలిచారా, అమ్మాయిగారూ!'' అంటూ.

''ఏం చేస్తున్నావు? ముందు ఆ ముష్టివాడి కేదైనా వేసి పంపించేసి తర్వాత నీ పని చూసుకో.'' నా కళ్ళలో నీళ్ళు దాచుకుంటూ చెప్పాను.

''అలాగే!'' అంటూ వెళ్ళిన రంగమ్మ, మళ్ళీ కొంచెం సేపట్లో నా గదిలోకి వచ్చింది — ''జడ వెయ్యనా, అమ్మాయిగారూ?'' అంటూ.

వెయ్యమన్నాను.

జడ వెయ్యడం పూర్తయి, వెళ్ళిపోబోతున్న రంగమ్మని వెనక్కి పిలిచాను.

''ఇందాక వచ్చిన ముష్టివాడు కుంటివాడు కదూ, రంగమ్మా!''



# మూగమనసులు

—తమిరిశ జానకి

నా ప్రశ్నకి తల ఊపింది రంగమ్మ అవునన్నట్టుగా.

"రంగమ్మా! బీదవా ళ్ళింట్లో పుట్టి ఉంటే నేనూ వాడిలాగే అరుస్తూ వీధి వీధీ తిరగాలి కదూ?"

నా ప్రశ్నకి రంగమ్మ గొంతులో బాధ సుళ్ళు తిరిగింది. "అమ్మాయి గారూ!" బాధని నొక్కి పెడుతూ, జాలిగా నా వంక చూసింది.

"ఈ ఏక్సిడెం టయిన రోజునించీ నా అంత దురదృష్టవంతులు ఉండరని కుమిలిపోతున్నాను. కానీ ... ఆ ముష్టి వాడితో పోల్చుకుని నా అంత అదృష్ట వంతురాలు లేదని సంతోషించాలి, రంగమ్మా! సంతోషించాలి. అడిగిందల్లా ఇస్తూ, అతి ప్రేమగా చూసుకు గారు, కంటికి రెప్పలా కాపాడే నిత్యం నా కూడా ఉండి నా ప ట్లోనూ సహాయపడే నువ్వూ— ఉండగా, నేను కుంటిదాన్నయి


# రుచికరమైన, పుష్టికరమైన బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు




## పెరిగే పాపాయిలకు రుచివంతమైన తోడు

బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు మరీ అంత ప్రత్యేకమైన రుచి గలిగి ఉండటానికి ఏమిటి కారణం? వాటిలో గల సమృద్ధినిచ్చే, సంపూర్ణమైన పుష్టినిచ్చే లక్షణాలే. పిల్లలకు యివి యిష్టం, పెరుగుతారు ఎంతో బాగా వాటితో. బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు ఎదిగే మీ పిల్లలకు ఎంతో మంచివి.

బ్రిటానియా

**బిస్కట్లు అత్యుత్తమమైనవి**

లింటాస్-BBC.GLX-6-140 TL

న్నా దిగులు నాకు ఉండకూడదు. నేను బాధపడకూడదు. ఎన్ని రకాలుగానో అదృష్టవంతురాలిని నేను. ఎన్ని సుఖాలో అనుభవిస్తున్నాను. ఇంత ఆస్తికీ ఏకైక వారసురాల్ని. అటువంటప్పుడు ప్రమాదవశాత్తూ కుంటిదాన్నయినందుకు ఆ ఒక్క కారణంగా నా అంత దురదృష్టవంతులే ఉండరనుకోవడం పొరపాటు కదూ? ఏ ఒక్క లోటూ కూడా భగవంతుడు నాకు కలగచెయ్య కూడదనుకోవడం అత్యాశ కదూ?''నా కళ్ళు కిందికి వాలిపోయాయి. టపా టపా కన్నీరు నా చీరని తడిపింది. నోట మాట రాక, బాధతో, అప్యాయంగా నా తలని తన గుండె కాన్చుకుంది రంగమ్మ.

ఒక నిమిష మయ్యాక అంది: ''బావ రేపు వస్తానని ఉత్తరం రాశారట కదమ్మా?''



''అవును.''

''ఇంక మీరు త్వరలోనే శ్రీమతి గిరిబాబుగారై పోతారు.''

''రంగమ్మా!'' నాగొంతు వణికింది.

రంగమ్మ కళ్ళలో ఆశ్చర్యం తొణికిసలాడింది.

''ఏమిటమ్మా?'' అంది కంగారుగా.

''ఏం లేదు. అమ్మ ఎందుకో పిలుస్తున్నట్టుంది. వెళ్ళు. అక్కడ పని చూడు. నేను కాస్సేపు పడుకుంటాను.''

మంచం మీద వెనక్కి వాలాను. మాట తప్పించాలని రంగమ్మనైతే పంపించేశాను గానీ, నా మనసులోని ఆలోచనల్ని ఎలా బయటికి పంపించను?

బావ పేరు తలుచుకుంటేనే నా గుండెలో సంతోషం ఎగిసిపడే దిన్నాళ్ళూ. కానీ, ఇప్పుడు ... ఈ కుంటికాలు నా సంతోషాన్ని అణగదొక్కి బావకీ, నాకూ మధ్య తెర దింపుతా నంటూంది. బావ రేపొద్దున్న వస్తాడు. ఈ ఏక్సిడెంటు గురించి, నేను కుంటిదాన్నవడం గురించి నాన్నగారు బావకి ఉత్తరం వ్రాశారు. ఎంతో బాధపడుతూ, విచారం వ్యక్తపరుస్తూ వెంటనే సమాధానం వ్రాశాడు బావ. ఆ ఆఖరి పరీక్ష వ్రాసిన వెంటనే రైలెక్కుతాననీ, కౌసల్యకి ధైర్యం చెప్పమనీ, దిగులుపడకుండా చూడమనీ వ్రాశాడు.

చిన్నప్పటినించీ బావకి నే నంటే ఎంతో ఇష్టం. నేను పుట్టగానే గిరిబాబు భార్య అన్నారు పెద్దవాళ్ళు. అప్పటినించీ ఇప్పటిదాకా పెద్ద వాళ్ళ మాట అదే. నాకు కూడా బావ మీద అదే అభిప్రాయం ఉంది. కారణం—పెద్దవాళ్ళ మాటలు హృదయంలో నాటుకుపోవడం కావచ్చు. బావ చదువు పూర్తవగానే బావతో నా పెళ్ళి జరిపించెయ్యాలని అటు అత్తయ్య, ఇటు అమ్మ, నాన్నగార్ల అభిప్రాయం. సెలవుల్లో అప్పుడప్పుడు వస్తూనే ఉన్నాడు బావ. బావ ఇక్కడ ఉన్న నాలుగు రోజులూ నాలుగు క్షణాల్లా గడిచిపోతాయి సరదాగా. చిలిపిగా నా నెత్తిమీద బావ మొట్టినప్పుడల్లా లేని కోపం చూపిస్తూ నేను అలగడం, 'ని కోపం పోవాలంటే ఏం చెయ్యాలో చెప్పు. చేస్తాను, తల్లీ!' అంటూ బావ బతిమాలడం ... తలుచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తుంది ఇప్పటికీ. కానీ, ఇప్పుడింక ఆ తలపులే నాలో తల ఎత్తకూడదు. అవును. నేను తీసుకున్న నిర్ణయం అటువంటిది. నాన్నగారేమో బావదగ్గర పెళ్ళి ప్రస్తావన తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయన ఆత్రత ఆయనది. 'చదువు పూర్తయింది కదూ? ఇంక దాని మెడలో ఆ మూడు ముళ్ళూ వెయ్యి' అనేస్తారు. కానీ, ఆదివరకటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు. చిన్నప్పటి నించీ అనుకున్న సంబంధం కదా అని, ఇప్పుడు నేను కుంటిదాన్నయినా కూడా బావ నన్నే పెళ్ళాడి తీరాలి అని అనేటంత మూర్ఖురాలిని కాదు నేను. కుంటిదాన్ని చేసుకుని బావ ఏం సుఖపడగలడు? బావే కాదు, మరెవరు నన్ను చేసుకుందుకు ముందు కొచ్చినా కూడా నేను మాత్రం పెళ్ళి చేసుకోను. ఈ జీవితం ఇలా సాగిపోవలసిందే తప్ప మరొకరి మెడకి గుదిబండ కాకూడదు. ఇదే నేను తీసుకున్న నిర్ణయం. నా నిర్ణయం ఇంక మారదు.

## గిరిబాబు

కౌసల్యని తలుచుకుంటేనే గుండె చెరువవుతూంది. భగవంతు డెందు కిలా చిత్ర విచిత్రంగా ఆటలాడతాడు? అన్నీ ఉన్న కౌసల్యకి హఠాత్తుగా ఎంత పెద్ద లోటు కలగజేశాడు! ఇప్పుడు పెద్ద చిక్కు సమస్య వచ్చింది. చిన్నప్పటి నించీ నన్నే అల్లుడుగా చేసుకోవాలన్న ఆలోచన అత్తయ్య, మామయ్యలకుంది. కానీ, వాళ్ళ మాటల్ని నే నెప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. వాళ్ళు అనే వేళాకోళం మాటల్ని కూడా వినిపించుకునేవాడిని కాదు. అవేళ్ళ ఉడుక్కుంటే చూడటం సరదా కాబట్టి, ఏడిపిస్తుండేవాడిని కౌసల్యని, ఆటల్లో. అంతేకానీ, నా కాబోయే భార్య అన్న దృష్టితో కౌసల్యని వేళాకోళం చెయ్యలే దెప్పుడూ. ఈ ఊళ్ళో నా క్లాసుమేట్ చెల్లెలు లీలతో పరిచయం అవడం, పరిచయం ప్రేమదాకా రావడం జరిగిపోయింది. పరీక్షలయ్యేదాకా ఈ సంగతి ఎవరికీ చెప్పడం ఇష్టంలేక, కనీసం అమ్మతో కూడా ఇంతవరకూ లీల సంగతి చెప్పలేదు నేను. లీలనే పెళ్ళి చేసుకోవాలన్న కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. కౌసల్య కేమీ లోటు లేదు. అందం, చదువు, ఆస్తి, అంతస్తు—అన్నీ ఉన్నాయి. బోలెడంత ఆస్తికి ఏకైక వారసురాలు. నన్ను మించిన వాడిని తీసుకొచ్చి కౌసల్య పెళ్ళి చెయ్యగలడు మామయ్య. కౌసల్యని చేసుకునే అభిప్రాయం నాకు లేదని, నేను చేసుకోనని చెప్పినంతమాత్రంలో కౌసల్య కేమీ నష్టం లేదని నాకు నేనే నచ్చ చెప్పుకునే వాడిని ఇన్నాళ్ళూ. కానీ, ఇప్పుడు విధి వక్రించింది. పరిస్థితి తారుమారైంది. కౌసల్య కుంటిదైంది కారు ఏక్సిడెంటులో. జాలితో నా గుండె చెయ్యి ముక్క అవుతూంది. కౌసల్య పెళ్ళి చేసుకుని పిల్లా, పాపలతో కళకళలాడుతూ ఉంటే నాకు ఆనందం. అంతేగానీ, పెళ్ళి కాకుండా కుంటికాలితో, ఒంటరి బ్రతుకు బ్రతుకుతుంటే చూసి తట్టుకోడం నా వల్ల కాదు. కుంటిదైన కౌసల్యని పెళ్ళి చేసుకునేందుకు ఎవరు ముందు కొస్తారు? ఎవరైనా వచ్చినా కూడా ఆస్తి చూసి, అంతస్తు చూసి, డబ్బు అనుభవించడాని కొస్తారేమో! భార్యగా కౌసల్యని ఆదరిస్తాడో, లేదో... ప్రేమగా చూసుకుంటాడో, లేదో? ఊహూ! ప్రేమగా చూడడు. 'కుంటిదానివి, నీ కోసమింటే పడ్డాలో? ఓ మూల పడి ఉండవే!' అంటూ చీదరించుకుంటాడేమో! మరెవర్నో ఇంటికి తీసుకొచ్చి ఆట్లాడు చేస్తాడేమో? అవునంతే. అలాగే చేస్తాడు. ఆస్తి చూసి మెడలో తాళి కట్టిన వాడి ప్రవర్తన అంతకంటే విరుద్ధంగా ఎందుకుంటుంది? బాబో! కౌసల్య కంట తడి పెడితే నేను సహించలేను. కౌసల్య కష్టంపాలయితే నా మనసొప్పదు. పుట్టినప్పటినించీ అతిగారాబంగా పెరిగిన సుకుమారి కౌసల్య. అటువంటిది జీవితాంతం దుఃఖిస్తూ బ్రతుకుతుంటే చూడలేను. నాన్నగారు పోయాక ఎన్ని ఇబ్బందులు వచ్చినా నాకూ, అమ్మకీ అండగా నిలిచాడు మామయ్య. ఎంతగానో సహాయ సహకారాలు అందజేశాడు. ఆయనపట్ల నాకు గౌరవం, కృతజ్ఞత ఉన్నాయి. ఒక్కగా నొక్క కూతురు అవిటిదైనందుకు మామయ్య గుండె

చెదిరిపోయి ఉంటుంది. తన అనంతరం తన కూతురు ఏ కష్టమూ లేకుండా ఆనందంగా, సుఖంగా జీవించాలంటే ఆమెని పువ్వుల్లో పెట్టి చూసుకునే భర్త అండగా ఉండాలనీ, ఆ మనిషి చిన్నప్పటినించీ అనుకుంటున్న నేనే అనీ పదే పదే ఆలోచిస్తూ ఉండవచ్చి సమయంలో మామయ్య. నే నిప్పు డేం చెయ్యాలి? అటు కౌసల్య కంట తడి పెట్టడం చూడలేను; ఇటు లీల కిచ్చిన మాట వెనక్కి తీసుకోలేను. కుంటిదై పోయిన కౌసల్యని మనఃస్ఫూర్తిగా పెళ్ళాడి ప్రేమగా చూసుకొనే భర్త దొరకడం సంభవమేనా? ఉహూఁ ... నా మనసు ఒప్పుకోవటం లేదు. లీలతో ఈ విషయం మాట్లాడాలి. లీల ఏమంటుందో, తన అభిప్రాయం ఏమిటో వినాలి ...

లీలతో మాట్లాడాను. కౌసల్య పరిస్థితికి లీల గుండె ద్రవించింది. "కౌసల్య ఎంతో గారాబంగా పెరిగింది అనీ, చాలా మంచి అమ్మాయి అనీ నీ ద్వారా చాలాసార్లు విన్నాను. నిజంగా ఆ అమ్మాయికి దేవుడు పెద్ద లోటే చేశాడు. అన్యాయంచేశాడు. ఆ అమ్మాయి భవిష్యత్తు ఆలోచించి మనిద్దరం ఒకటి కాకపోవడం మంచిది, గిరీ!" అంటూ వణుకుతున్న గొంతుతో చెప్పింది. నాకు వెంటనే నోట మాట రాలేదు. మా మీద దేవు డెందుకు పగ బూనాడా అనిపించింది ఒక క్షణం. కనిపించని ఆ దేవుడిమీద నిందలు మోపుతూ తిట్టు కోవడ మెందుకూ అనిపించింది.

"స్నేహితులుగా విడిపోదాం, గిరి బాబూ" అంటూ పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటున్న లీలని చూసి నా గుండె చెదిరింది. అప్రయత్నంగా చేతులు చాపాను — "లీలా!" అంటూ. కానీ, నా చేతుల్లో వాలిపోలేదు లీల. రెప్ప వాల్చకుండా నా చేతులవంకే చూసి, ఆ తర్వాత చిన్నగా నిట్టూర్చి, "ఆ చేతులు కౌసల్యకి రక్షణగా ఉండాలి, గిరీ! వాటిలో ఒరిగే హక్కు ఆమెకే ఇవ్వు" అంది. ఆ మాట అనడానికి గుండె రాయి చేసుకుందనీ, మనసుని ఎంతగానో అదుపులో పెట్టుకుందనీ అనిపించింది నాకు. లీల మంచితనానికి నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "లీలా! నువ్వూ, కౌసల్యా ... మీ ఇద్దరిలో ఎవరి మనసు కష్టపడ్డా నేను చూడలేను" అన్నాను.

అంత బాధలోనూ చిన్నగా నవ్వింది లీల. "క్రిందటి జన్మలో ఏ ప్రేమికుల్నో విడదీసి ఉంటాం. ఈ జన్మలో ఇలా శాసిపెట్టాడు దేవు డందుకే. కనీసం ఈ జన్మలోనైనా స్వార్థం లేకుండా, మానవత్వం చూపించి, మరుజన్మలో ఒకటవుదాం. కౌసల్యని ప్రేమగా, కంటికి రెప్పలా చూసుకో. ఏ విషయంలోనూ ఆమె మనసు నలగనివ్వకు. ఆమె పరిస్థితిలో ఎవరున్నా సహజంగా విరక్తికి లోనవుతారు. అటువంటి భావాలు చిగుళ్ళు వేయనివ్వకు. ధైర్యం చెప్పి అండగా నిలబడు. మనఃస్ఫూర్తిగానే ఈ మాట లంటున్నాను నేను" అంటూ ముగించింది.

దీనంగా చూస్తున్న కౌసల్య రూపు కదలాడింది నా కళ్ళముందు. నాన్నగారు పోయినప్పటినుంచీ మా కష్టాల్లో పాలు పంచుకొని, మాకు ధైర్యం చెపుతూ, ఎన్ని విషయాల్లోనో మాకు సహాయపడిన మామయ్య రూపు మనసులో మెదిలింది.

'గిరీ! నువ్వు కాదంటే ఈ పరిస్థితిలో నా కూతురికి మరెవరు దిక్కు?' అంటూ బతిమాలుతూ, కన్నీళ్ళతో నా చేతులు పుచ్చుకున్న ట్లనిపించింది. విలవిల్లాడింది నా మనసు. గుండె దిటవు పరుచుకుని లీలకి వీడ్కోలు చెప్పాను. రైలెక్కాను.

## శ్రీధర్

కాలేజీలో నాకు జూనియర్ కౌసల్య. అందరి ఆడపిల్లల్లోకీ కౌసల్యే న న్నెంతగానో ఆకర్షించింది. నా హృదయంలో ఆమె రూపు ప్రతిష్ఠించుకున్నాను. కానీ, నా మనసెప్పుడూ ఆమెకి తెలియచెయ్యలేదు. కారణం–నేను మధ్యతరగతి వాడిని. ఆస్తిలో, అంతస్తులో ఆమెతో సరితూగలేను. 'మా కున్నంత డబ్బు నీకుందా? ఏం చూసుకుని నన్ను పెళ్ళాడతా నంటున్నావు?' అని ఆ అమ్మాయిగానీ, ఆమె తండ్రిగానీ నిలదీసి అడిగితే? ఈ ప్రశ్నే ఇంతింతై ఆక్రమించుకుని, ఆమె ముందు నా ప్రేమ వెల్లడించుకోనివ్వకుండా చేసింది. అలాగే కౌసల్యనే తలుచుకుంటూ, ఆమెనే ఆరాధిస్తూ, 'సంబంధాలు ఎన్నో వస్తున్నాయి. ఏదో ఒకటి స్థిరపరుచుకుందా' మని చెవిలో పోరు పెడుతున్న అమ్మ మాట లక్ష్యపెట్టకుండా గడిపేస్తున్నాను. అమ్మ ఎంతగానో బాధపడుతూంది. అమ్మ మనసు కష్టపెడుతున్నందుకు నాకూ బాధగానే ఉంది. ఇప్పుడు ... ఇప్పుడు జరిగింది మరీ అన్యాయం. భగవంతు డెంత నిర్దయుగా ప్రవర్తించాడు! కౌసల్య అవిటిదైంది. అయినా సరే, నా ప్రేమ కొంచెం కూడా తరగలేదు. కానీ, ఏం లాభం? ఇప్పుడు అసలు నా ప్రేమ బయటపెట్టుకుందుకు ఏమాత్రం వీల్లేదు. కౌసల్యని నేను పెళ్ళిచేసుకుంటానని, ఆమెని నేను ప్రేమిస్తున్నానని



ఇప్పుడు చెబితే — 'కుంటిదానిమీద జాలిపడినట్టుగా నటిస్తూ, డబ్బుకోసం పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు. నిజంగా ప్రేమించినవాడైతే ఇన్నాళ్ళూ ఎప్పుడూ ఆ సంగతే చెప్పలే దెందుకని?' అంటారు. "కుంటిపిల్లని ప్రేమిస్తున్నానంటూ తనంతట తానుగా ఎవరొచ్చి చెపుతారు? నిజమైన ప్రేమ కా దిది. నిశ్చయంగా డబ్బుమీద ప్రేమే" అంటారు. కౌసల్య కూడా నా ప్రేమని శంకించడానికి అవకాశం ఉంది, ఇదివరకే నే నీ సంగతి చెప్పి ఉండక పోవడం వల్ల. ఇంక కౌసల్యని పెళ్ళాడే ఆశ లేదు.



## గిరిబాబు

మామయ్య కన్నీరు చూడలేక పోయాను. "గిరీ! నా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. ఎప్పుడు ఈ గుండె ఆగిపోతుందోనన్నట్టుగా ఉంది నా పరిస్థితి. అమ్మాయికి జరిగిన అన్యాయం నన్ను మరింత క్రుంగదీస్తోంది. అమ్మాయికి ఇక నించీ అన్నీ నువ్వే. దాన్ని నీ చేతుల్లో పెట్టి హాయిగా కళ్ళు మూస్తాను" అంటూ చిన్న పిల్లాడిలా మామయ్య కంట తడి పెడుతూంటే నా మనసు బాధతో నలిగిపోయింది.

"నువ్వేం దిగులు పడకు, మామయ్యా! కౌసల్యని కంటికి రెప్పలా చూసుకుంటాను. తొందర్లోనే ముహూర్తం పెట్టించు. ఆ సంతోషంతో నీ ఆరోగ్యం తప్పక బాగుపడుతుంది" అన్నాను. నా మాటలతో మామయ్య కళ్ళలోకి తృప్తితో కూడిన మెరుపు వచ్చింది. పట్టలేని ఆనందంతో నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు.

మధ్యాహ్నం పోస్టులో ఉత్తరం వచ్చింది నాకు. లీల వ్రాసింది. "నాన్నగారికి మళ్ళీ హార్ట్ ఎటాక్ వచ్చింది. అందరం చాలా భయపడ్డాం. దేవుడి దయవల్ల అంతా సర్దుకుంది. ఇప్పుడు కొంచెం కులాసాగానే ఉన్నారు. బాగా రెస్టు తీసుకోమన్నారు డాక్టరు. పెద్దన్నయ్య ఈ నెలాఖరుకి రష్యా వెళుతున్నాడు. తన అనారోగ్యం కారణంగానూ, పెద్దన్నయ్య వెళ్ళిపోతున్నాడనీ ఈ నెలాఖరులోగా నా పెళ్ళి చేసెయ్యాలని నాన్నగారు చాలా పట్టుపట్టారు. ఆయన దృష్టి ఎప్పటినించో మా దూరపు బంధువుల్లో ఒకతని మీద ఉంది. ఆ సంబంధమే స్థిరపరుచుకుని వచ్చారు. నా మాట వినిపించుకునే స్థితిలో ఎవరూ లేరు. ఆలోచించుకునేందుకు కూడా వ్యవధి నా కివ్వకుండా అంతా వాళ్ళే నిర్ణయాలు చేసేశారు. త్వరలో శుభలేఖ చూస్తావు." ఇదీ లీల ఉత్తరంలోని సారాంశం. ఉత్తరం మడిచి బీరువాలో పెడుతుండగా రంగమ్మ వచ్చింది.

"ఏం కావాలి, రంగమ్మా? కౌసల్య నన్ను పిలుస్తోందా? ఇదుగో వస్తున్నాను, పద."

ఒక్క క్షణం నా కళ్ళలోకి చూసి తల వంచుకుంది కౌసల్య. ఆ క్షణంలో కౌసల్య మొహంలో భావాలు చదవలేక పోయాను.

"బావా! కావాలంటే ఈ ఆస్తంతా నువ్వే తీసుకో. కానీ ... డబ్బుకోసం ఈ కుంటిదాన్ని పెళ్ళి చేసుకుంటానని ప్రేమ నటించకు. నన్ను పెళ్ళి చేసుకుంటే గానీ ఈ ఆస్తి అనుభవించడానికి కుదరదన్న భయంతో, నేను కుంటిదాన్ని అయినా కూడా నన్ను పెళ్ళి చేసుకుంటా నంటున్నావు. ఇదివరకటి ప్రేమ చెక్కు చెదరకుండా అలాగే ఉన్నట్టు నటిస్తున్నావు..."

కౌసల్య మాటలకి నా నెత్తిన పిడుగు పడినట్టయింది.

నా నోట్లోంచి మాటే రాలేదు.

కౌసల్యేనా ఈ మాట లంటున్నది అనిపించింది.

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను.

ఇంతకంటే నా గుండెలో గునపం దింపితే సంతోషిస్తాను.

"నీకంటే శంకర్ వెయ్యి రెట్లు నయం, బావా! అన్నట్టు, శంకర్ ఎవరో నీకు తెలియదు కదూ? అతను నా ఫ్రెండు. అతన్ని ప్రేమించాను. నాన్నగారికి కూడా ఈ సంగతి తెలియదు. అతణ్ణే నా మనసులో ప్రతిష్ఠించుకున్నాను. నేను అవిటిదాన్ని అయిపోవడంతో శంకర్ నన్ను పెళ్ళాడేందుకు ఇష్టపడలేదు. అంత్య నిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరం మేలుకదా? ఆస్తిమీద మోజుతో మనసులో ఇష్టం లేకపోయినా, నటన చూపిస్తూ చేసుకుంటానని అనలేదు. అందుకే నీ కంటే అతనే నయం అంటున్నాను."

కౌసల్య మాటలు ... ఒక్కొక్క మాటా ఒక్కొక్క వాడి బాణమై నన్ను చిత్రహింస చేస్తున్నాయి.

"నేను జీవితాంతం ఇలాగే ఉండిపో దలుచుకున్నాను. పెళ్ళి చేసుకునే ఆలోచన రానివ్వను నా మనసులోకి. శంకర్‌కి అంకితమైన ఈ మనసులో నీకు చోటివ్వలేను. దయచేసి నన్ను పెళ్ళిచేసుకుంటాననే మాట మరోసా రెప్పుడూ నాన్నగారి దగ్గర అనకు. ఇంక నువ్వెళ్ళొచ్చు." కౌసల్య మాటలు నన్ను మూగవాడిని చేశాయి. గదిలోంచి ఇవతలికి వచ్చేశాను. డబ్బుకోసం కౌసల్యని చేసుకుందా మనుకున్నానా నేను? డబ్బుకోసం ప్రేమించిన లీలని దూరం చేసుకున్నానా? భగవాన్! ఇంత అపవాదు భరించడం నావల్ల కాదు.

## కౌసల్య

బావని అంత మాట అనడానికి నేనెంతగా గుండె రాయి చేసుకోవలసి వచ్చిందో ఆ భగవంతు డొక్కడికే తెలుసు. ఏం చెయ్యను మరి? అదొక్కటే నాకు మార్గంలా కనిపించింది. బావకేం తక్కువని ఈ కుంటిదాన్ని చేసుకోవాలి? ఏ వంకా లేని సంబంధాలు బోలెడన్ని వస్తాయి. అందం, పెద్ద చదువు, గుణం అన్నీ ఉన్న బావకి, ఈవేళో రేపో పెద్ద ఉద్యోగస్థుడు కాబోతున్న బావకి ఈ కుంటిది భార్యగా తగదు. నాలాటిదాన్ని చేసుకుని ఏం సుఖపడగలడు? కానీ, బావ మాత్రం నన్ను పెళ్ళి చేసుకోవడానికి అభ్యంతరం చెప్పటం లేదు. నాన్నగారు కూడా ఎంత వీలైతే అంత త్వరగా మా పెళ్ళి జరిపించడానికి సిద్ధంగా ఉన్నారు. కుంటిదాన్ని చేసుకుని సుఖపడలేవు, బావా! వద్దు, నన్ను పెళ్ళి చేసుకోవద్దు అని మెల్లిగా చెపితే వింటాడా బావ? ఊహూ! వినడు. అందుకే బావ మనసు కష్టపెట్టే ఆ మాట అన్నాను. డబ్బు ఆశించి ఈ కుంటిదాన్ని చేసుకుందుకు సిద్ధపడుతున్నావని అనరాని మాట అని బావ మనసు కష్టపెట్టక తప్పింది కాదు. ఏం చెయ్యను? బావ నన్ను చేసుకోకుండా ఉండాలంటే అదొక్కటే నాకు మార్గంలా కనిపించింది. నాకు శంకర్ అనే స్నేహితుడూ లేడు, నే నెవరినీ ప్రేమించనూ లేదు.